క్లుప్తంగా

పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు తీసుకోండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకటరత్నమ్మ

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ వెంకటరత్నమ్మ సూచించారు. గురువారం ఆమె బదిలీపై మండలానికి వచ్చిన గ్రామ కార్యదర్శులతో స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశపు హాల్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామాల్లో ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలని తెలిపారు. తాగునీటి సమస్యలు లేకుండా, ప్రజాప్రతినిధులతో సఖ్యంగా ఉండాలన్నారు. డ్రైనేజీ కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని, తాగునీటి ట్యాంకులను శుభ్రం చేసి, క్లోరినేషన్ చేయాలని తెలిపారు. పెండింగ్ సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి

బుచ్చినాయుడుకండ్రిగ: క్షయ వ్యాధిని నిర్మూలిస్తామని వైద్యాధికారి మురళీధర్‌రెడ్డి, సీహెచ్‌ఓ వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలోని పార్లపల్లి పంచాయతీ పరిధిలోని టీబీపురం గ్రామంలో గురువారం క్షయ వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించి, ప్రజలచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీబీ ముక్తభారత్ నూరు రోజులు అవగాహన కార్యక్రమంలో భాగంగా ప్రజలకు టీబీ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. టీబీ వ్యాధి నివారణకు ప్రభుత్వం ఉచితంగా మందులను పంపిణీ చేస్తుందన్నారు. మందులను సక్రమంగా వాడితే టీబీ జబ్బు నయం అవుతుందని తెలిపారు. టీబీ, క్షయజబ్బులు అంటువ్యాధులని, వ్యాధిగ్రస్తులు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. టీబీ జబ్బు నిర్ధారణ కోసం ప్రభుత్వాస్పత్రుల్లో ఉచితంగా గల్లా పరీక్షలు చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

టీబీపై అశ్రద్ధ వద్దు



సత్యవేడు సబ్‌జైలులో ఖైదీలకు టీబీపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ క్రిష్టల్ దాస్

సత్యవేడు: టీబీ పట్ల ప్రజలు అశ్రద్ధ వహించరాదని దాసుకుప్పం పీహెచ్‌సీ డాక్టర్ క్రిష్టల్ దాస్ అన్నారు. శుక్రవారం సత్యవేడు సబ్‌జైలులోని నిందితులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా టీబీ పట్ల అశ్రద్ధ వహించవద్దని సూచించారు. ఖైదీలకు గల్ల పరీక్షలు చేశారు. కార్యక్రమంలో సబ్‌జైల్ అధికారి కరీమ్, డాక్టర్ హర్షవర్ధన్, ఎంపీహెచ్ ఈఓ సుబ్రమణ్యం, ఎం.మురళి, ఏఎన్‌ఎంలు మేరి, అనూష మేఘన, ద్రాక్షాయణి తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు



అవగాహన కల్పిస్తున్న సీఐ తిమ్మయ్య

బుచ్చినాయుడుకండ్రిగ: మండలకేంద్రంలోని మెయిన్‌రోడ్డుపై ఆటోలు, వాహనాలను నిలపడం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుందని, వాహనాలను నిలపకూడదని సీఐ తిమ్మయ్య తెలిపారు. ఆయన గురువారం బుచ్చినాయుడుకండ్రిగలోని మెయిన్‌రోడ్డుపై నిలిపిన వాహనాదారులకు అవగాహన కల్పించారు. ఆటోవాలాలు, ద్విచక్ర వాహనదారులు మెయిన్‌రోడ్డులో అడ్డదిడ్డంగా పెడుతున్నారని, దీంతో షాపు యాజమానులు, లారీ, బస్సుల వాహనదారులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఆటోవాలాలు ఆటోలను ఎక్కడపడితే అక్కడ పెట్టవద్దన్నారు. షాపుల వద్దకు సరుకులకు వస్తున్న ద్విచక్ర వాహనదారులు రోడ్డుపై పెట్టకూడదని సూచించారు. వాహనదారులు వాహనాలను మెయిన్‌రోడ్డులో నిలిపి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే జరిమానాలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ విశ్వనాథనాయుడు, కానిస్టేబుళ్లు, ఆటోవాలాలు పాల్గొన్నారు.

వేదోక్తంగా గురుదక్షిణామూర్తికి పూజలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురుదక్షిణామూర్తికి గురువారం వేదోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గురుదక్షిణామూర్తికి పలు రకాల అభిషేకపూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

మట్టి తోడేస్తున్నారు!



ట్రాక్టర్‌లో మట్టి నింపుతున్న జేసీబీ



ప్రైవేటు వెంచర్‌కు తోలిన మట్టి

శ్రీకాళహస్తి: మండలంలోని పలు గ్రామాల్లో చెరువులు, కుంటలు నుంచి ఎలాంటి అనుమతి లేకుండా దర్జాగా మట్టి అక్రమ తవ్వకాలు సాగుతున్నాయి. దీనిపై మైనింగ్, రెవెన్యూ అధికారులు ఏమాత్రం దృష్టి సారించడంలేదు. ఎవరైనా దీనిపై అడిగితే అపుడే తెలిసినట్టుగా అధికారులు తమ సిబ్బందిని పంపించి పరిష్కరిస్తామని దాటవేస్తున్నారు. చుక్కల నిడిగల్లు గ్రామంలో ఓ టీడీపీ నాయకుడు కనుసన్నల్లో మట్టి, ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. ఇతరులు ఎవరైనా ఇసుక లోడు ఎత్తితే వారిని పోలీసులకు మాత్రం పట్టించి తాను మట్టి, ఇసుక వ్యాపారం చేసుకుంటూ పబ్బం గడుపుకుంటున్నాడు. ఓ ప్రైవేటు వెంచర్ కోసం చుక్కలనిడిగల్లులోని చెరువులోని మట్టిని జేసీబీలతో తవ్వి నిరంతరాయంగా తరలిస్తుంటే అధికారులు ఏమీ తెలియనట్లు మిన్నకుంటున్నారు. అధికార పార్టీ నాయకులు అయితే ఏమైనా చేయొచ్చా అని స్థానికులు విస్తుపోతున్నారు. స్థానికులు మట్టి ట్రాక్టర్లతో చాలా ఇబ్బందులు ఎదర్కొంటున్నారు. రోజుకు వంద నుంచి 150 ట్రిప్పులు మట్టి తరలిస్తున్నారు. దీనిపై స్థానికులు అడిగితే మాకు అధికారులు, పెద్దనాయకులు అండదండలు ఉన్నాయంటూ బెదిరిస్తున్నారు.

పంచాయతీ అప్రూవల్ లేకుండా లేఔట్

చుక్కలనిడిగల్లు రెవెన్యూ పరిధిలో సర్వే నంబరు 254/4ఏ, 254/4బీలో రెండెకరాల పొలంలో పంచాయతీ, తుడా అప్రూవల్ లేకుండా లేఔట్ వేసి విక్రయాలు మొదలుపెట్టారు. దీనిపై మండల రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదు. రూ.3కోట్ల విలువ కలిగిన ఈస్థలం లేఔట్ అయితే రూ.3లక్షలు వరకు పంచాయతీకి ఆదాయం వస్తుందని, అధికారులు స్పందించకపోవడంతో నష్టం కలుగుతుందన్నారు. కలెక్టర్ వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సింహవాహనంపై పరాశరేశ్వరస్వామి



నారాయణవనం: టీటీడీ అనుబంధ చంపకవల్లీ సమేత పరాశరేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో గురువారం సాయంత్రం సింహ వాహనంపై స్వామివారి గ్రామ వీధుల్లో విహరించారు. ఉదయం ఆలయంలో నిత్యపూజా కార్యక్రమాలు నిర్వహించారు. పరివార దేవతలకు అభిషేకాలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. ఉదయం 10 గంటలకు చంపకవల్లీ, పరాశరేశ్వర్లుకు స్నపన తిరుమంజనం నిర్వహించి దూప, దీప నైవేద్యాలను సమర్పించారు. సాయంత్రం ఉత్సవర్లు సింహవాహనాన్ని అధిరోహించగా సర్కారు హారతి అందుకున్న దేవేరులు గ్రామోత్సవంలో విహరిస్తూ భక్తుల నుంచి హారతులు అందుకున్నారు. కార్యక్రమాలను టీటీడీ స్థానిక ఆలయ ఏఈఓ రవి, సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయ అధికారి నాగరాజు, అర్జితం అధికారి భరత్‌లు పర్యవేక్షించారు. ఉత్సవాలలో మూడో రోజు శుక్రవారం సాయంత్రం స్వామివారు హంస వాహనంపై అధిష్టించి ఊరేగింపులో దర్శనం ఇవ్వనున్నారు.

చిందేపల్లి హౌసింగ్ లేఔట్ పరిశీలన



చిందేపల్లి లేఔట్‌ను పరిశీలిస్తున్న సీసీఎల్‌ఏ జయలక్ష్మి

ఏర్పేడు: సీసీఎల్‌ఏ(చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్) జయలక్ష్మి గురువారం మండలంలోని చిందేపల్లిలోని జగనన్న కాలనీ లేఔట్‌ను పరిశీలించారు. తిరుపతి పట్టణంలోని పేదలకు ఇక్కడ ఇంటి స్థలాలను కేటాయించి ఇళ్ల నిర్మాణాలను చేపట్టారు. అయితే వారిలో ఇంకా ఇళ్లు నిర్మించుకోకుండా ఖాళీగా ఉన్న ప్లాట్‌లను ఆమె పరిశీలించారు. కూటమి ప్రభుత్వం పట్టణ ప్రజలకు రెండు సెంట్లు, గ్రామీణ ప్రజలకు మూడు సెంట్లు ఇంటి స్థలాన్ని ఇస్తామని హామీ ఇచ్చిన నేపథ్యంలో ఇంకా ఇళ్లు నిర్మించుకోని లబ్ధిదారులకు రెండు సెంట్ల స్థలం కేటాయింపునకు సంబంధించి ఈ లేఔట్‌లో సాధ్యాసాధ్యాలను ఆమె సంబంధిత అధికారులతో చర్చించారు. గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, శ్రీకాళహస్తి ఆర్డీఓ భానుప్రకాష్‌రెడ్డి, జిల్లా సర్వే ఏడీ అరుణ్‌కుమార్, హౌసింగ్ పీడీ దయాకర్, తహసీల్దార్ భార్గవి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి ధర్మరాజస్వామి ఉత్సవాలు



ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న ఈఓ బాపిరెడ్డి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా చెన్నై రోడ్డులో వెలసిన ద్రౌపదీ సమేత ధర్మరాజ స్వామి ఉత్సవాలు శుక్రవారం నుంచి ఘనంగా ప్రారంభం కానున్నాయి. 27వ తేదీ నుంచి జూలై 9వ తేదీ వరకు ఉత్సవాలను సంప్రదాయబద్ధంగా నిర్వహించనున్నారు. ఆలయ పరిసరాలను సుందరంగా ముస్తాబు చేశారు. గురువారం విద్యుత్ దీపాలంకరణ చేశారు. 28న పాండవ విద్యాభ్యాసం, 29న హిడింబాసుర వధ, 30న మత్స్యయంత్ర ఛేదనం, జూలై1న ద్రౌపదీ కల్యాణం, 2న రాజసూయాగం, 3న ద్రౌపదీ వస్త్రాపహరణం, 4న అర్జున తపస్సు, 5న ఉత్తర గోగ్రహణం, 6న దుర్యోధన, దుశ్శాసన వధ, అగ్నిగుండం, 7న ధ్వజావరోహణం, 8న కుంభం, 9న పార్వేట ఉత్సవంలో ముగియనున్నాయి. వారం రోజుల ముందు నుంచే ఏర్పాట్లను ముమ్మరం చేశారు. ఈఓ బాపిరెడ్డి గురువారం ఆలయంలో ఏర్పాట్లు పర్యవేక్షించారు. క్యూలు, అగ్నిగుండ మహోత్సవం, అర్జునతపస్సు వంటి ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఆలయ అధికారులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు

మా స్కూలు మాకు కావాలి

శ్రీకాళహస్తి: మా స్కూల్ మాకు కొనసాగించాలని శ్రీకాళహస్తి మండలం వేడాంకు చెందిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అంటున్నారు. వారు మాట్లాడుతూ వేడాం గ్రామంలో ప్రాథమిక పాఠశాల ఉండేదన్నారు. ప్రస్తుతం వేడాం జెడ్పీ పాఠశాలకు మార్చారన్నారు. అయితే ప్రభుత్వ నిర్ణయం ప్రకారం మోడల్ స్కూల్ విధానం తెచ్చారని ఏడు పాఠశాలలను రద్దుచేసి ఎవరికి అందుబాటులో లేని బీసీ కాలనీలో మోడల్ స్కూల్ ఏర్పాటు చేయడం బాధాకరమన్నారు. దీంతో విద్యార్థులు ఇబ్బంది పడతారన్నారు. మా పిల్లలకు అందుబాటులో ఉన్న తమ పాఠశాలను యథావిధిగా కొనసాగించాలని వారు కోరారు.

ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు



క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

వరదయ్యపాళెం: మండలంలోని కడూరు, సంతవేలూరు గ్రామాల్లో టీటీడీకి చెందిన శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్)ఆధ్వర్యంలో గురువారం వరదయ్యపాళెం పీహెచ్‌సీ పరిధిలోని కడూరు, సంతవేలూరు గ్రామాల్లో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. పింక్ బస్సుల ద్వారా మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, పురుషులకు నోరు, రొమ్ము క్యాన్సర్ నిర్ధారణకు మ్యామోగ్రామ్ పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా స్వచ్ఛందంగా మహిళలు, పురుషులు పరీక్షలు చేయించుకున్నారు. స్విమ్స్ వైద్యులు కె. నాగరాజు, డాక్టర్ హరిత, డాక్టర్ పద్మావతి, వరదయ్యపాళెం వైద్యాధికారి డాక్టర్ బి.ద్వైత, సర్పంచులు సుజాతమ్మ, నాగయ్య, సీహెచ్‌ఓలు కృష్ణమరాజు, శిల్ప, శారద, ఏఎన్‌ఎంలు లత, సెల్వి కుమారి, పాల్గొన్నారు.

అంజూరు భూములను స్వాధీనం చేసుకోవాలి

వరదయ్యపాళెం: ఉబ్బలమడుగు పర్యాటక కేంద్రంలో కల్కి ట్రస్టు ఆక్రమించుకున్న 20.75 ఎకరాల అంజూరు అటవీ భూములను స్వాధీనం చేసుకోవాలని భారత హేతువాద సంఘం అధ్యక్షుడు నార్ని వెంకటసుబ్బయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఆయన మంగళగిరిలోని జనవాణి జనసేన భరోసాలో కల్కి ఆక్రమిత భూముల గురించి విన్నవించారు. ఉమ్మడి సర్వే పేరుతో రెవెన్యూ, అటవీశాఖ వారు దోబూచులాట ఆడుతున్నారని, ప్రభుత్వం వెంటనే స్పందించి ఆక్రమిత భూములను స్వాధీనం చేసుకోవాలని వినతి పత్రం ద్వారా విన్నవించినట్లు ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే కాలయాపన చేస్తున్నారని, ఇకపై ఇలాంటి నాటకాలు ఆపి భూములు స్వాధీనం చేసుకోవాలని కోరారు.

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి



మాట్లాడుతున్న ఏపీఎం మునెయ్య

బుచ్చినాయుడుకండ్రిగ: వన్ ఫ్యామిలీ, వన్ ఎంటర్‌పెన్యూర్ లక్ష్యంలో భాగంగా ప్రభుత్వం అందజేస్తున్న పీఎంఈజీపీ, పీఎంఎఫ్‌ఎంఈ, సీఐఎస్, ఉన్నతి, స్త్రీనిధి పథకాలను మహిళ సమాఖ్య సభ్యులు సద్వినియోగం చేసుకుని పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఏపీఎం మునెయ్య తెలిపారు. గురువారం బుచ్చినాయుడుకండ్రిగలోని వెలుగు కార్యాలయంలో మండల మహిళ సమాఖ్య లీడర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రుణాలను సకాలంలో చెల్లించి, బ్యాంకుల్లో పరపతి పెంచుకోవాలన్నారు. మహిళ సమాఖ్య సభ్యులు ఆవులు, గేదెలు పాలు మన పాల సెంటర్‌కే పోయడం ద్వారా గిట్టుబాటు ధర పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం రేవతి, ప్రకృతి వ్యవసాయం కోఆర్డినేటర్ వెంకటచలం, సీసీలు వెంకటరత్నం, వీరజిన్నప్ప, తదితరులు పాల్గొన్నారు.

చెత్త డంపింగ్ యార్డు పరిశీలన

సాక్షి ఎఫెక్ట్..



డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న అధికారులు

రేణిగుంట: మండలంలోని గాజుల మండ్యం పంచాయతీ ఏపీఐఐసీ క్వార్టర్స్ పక్కన చెత్త డంప్ వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులపై గురువారం సాక్షిలో వచ్చిన ‘చెత్త డంపు.. భరించలేని కంపు ’ కథనానికి స్పందించిన అధికారులు గురువారం ఆ ప్రాంతాన్ని ఏపీఐఐసీ డీజెడ్ఎం నాగమల్లయ్య, బిల్ కలెక్టర్ ఫజల్, పంచాయతీ ఈఓ గిరిధర్ రెడ్డి, సర్పంచ్ గంగారి రమేష్, ఎంపీటీసీ జువ్వల ధనంజయరెడ్డి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సూపర్‌వైజర్ కామరాజు సిబ్బందితో కలిసి పరిశీలించారు. చెత్త డంపింగ్ చేసిన వారితో మాట్లాడి పది రోజుల్లో మొత్తం చెత్తను ఇక్కడి నుంచి ఎత్తేయాలని ఆదేశించారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే





జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు, పట్టా అందుకుంటున్న విద్యార్థిని

రేణిగుంట: కరకంబాడి సమీపంలోని అన్నమాచార్య సాంకేతిక కళాశాలలో గురువారం మూడవ గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి అనంతపురం జేఎన్టీయూ ఉపకులపతి ప్రొఫెసర్ సుదర్శన్‌రావు, గౌరవ అతిథిలుగా గాదంకి ఎన్ఏఆర్ఎల్ డైరెక్టర్ అమిత్‌కుమార్ పాత్ర, యూనివర్సిటీ నామినీగా ప్రొఫెసర్ బి.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు. గ్రాడ్యుయేట్లను ఘనంగా స్వాగతించి సత్కరించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అతిథుల చేతుల మీదుగా 723 విద్యార్థినీ విద్యార్థులు పట్టాలను అందుకున్నారు.కళాశాల చైర్మన్ డాక్టర్ సి గంగిరెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.నాథమునిరెడ్డి, వివిధ విభాగాధిపతులు ఆర్‌అండ్‌డీ డైరెక్టర్ డా.గురుజవహర్, ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్ డా.కె.రమ్య పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి







రేణిగుంట బస్టాండ్‌లో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఎస్పీ, బుచ్చినాయుడుకండ్రిగ: ర్యాలీలో సీఐ తిమ్మయ్య, నారాయణవనంలో మానవహారం

రేణిగుంట: అంతర్జాతీయ మాదకద్రవ్యాల నిర్మూలన దినోత్సవం సందర్భంగా గురువారం రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో తిరుపతి- రేణిగుంట ప్రధాన రహదారిలో విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. మాదక ద్రవ్యాలు వద్దు అంటూ ప్లే కార్డులు చేతపట్టి నినాదాలు చేస్తూ ర్యాలీగా బస్టాండ్‌కు చేరుకుని విద్యార్థులతో మానవహారం నిర్వహించారు. గుట్కా ప్యాకెట్లను దహనం చేసి విద్యార్థులతో మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రతిజ్ఞ చేయించారు. డీఎస్పీ మాట్లాడుతూ సమాజంలో ప్రతిఒక్కరూ మాదక ద్రవ్యాల నిర్మూలనకు తమ వంతు కృషిచేయాలన్నారు. సీఐలు జయచంద్ర, మంజునాథరెడ్డి, ఎస్‌ఐలు అరుణ్‌కుమార్‌రెడ్డి, సుధాకర్, రాస్ సిబ్బంది పాల్గొన్నారు. అదేవిధంగా ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ప్రభురావు ఆధ్వర్యంలో మహిళలతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంఈఓలు ఇందిరాదేవి, రంగనాథయ్య, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తిలో..

శ్రీకాళహస్తి: యాంటీ డ్రగ్స్‌డేను పురస్కరించుకుని పోలీసులు, ఎక్సైజ్ శాఖ, ఐసీడీఎస్, టీడీపీ నేతలు, విద్యార్థులు పాల్గొని పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. డీఎస్పీ నరసింహమూర్తి పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగలో..

బుచ్చినాయుడుకండ్రిగ: మాదకద్రవ్యాల అంతర్జాతీయ వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని బుచ్చినాయుడు కండ్రిగ పురవీధుల్లో సీఐ తిమ్మయ్య విద్యార్థులతో కలిసి ర్యాలీ చేపట్టి, అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ విశ్వనాథనాయుడు, ఎంపీడీఓ వెంకటరత్నమ్మ, ఎంఈఓలు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యం, ఏపీఎం మునెయ్య పాల్గొన్నారు.

నాగలాపురంలో

నాగలాపురం: అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నివారణ దే సందర్భంగా ఏఓ గుణశేఖర్ అధ్యక్షతన ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి ఆధ్వర్యంలో స్థానిక ప్రాథమిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్లస్ నుంచి పోలీసులు, ఉపాధ్యాయులు, విద్యార్థులంతా కలిసి డ్రగ్ నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎకార్యక్రమంలో ఎంఈఓ బాబయ్య, జనార్ధనరాజు, ఎస్‌ఐ సునీల్, ఏఎస్‌ఐ షణ్ముగం, హెచ్‌ఎం కస్తూరయ్య, పంచాయతీ కార్యదర్శి శంకరయ్య, ఉపాధ్యాయులు, నాయకులు పాల్గొన్నారు.

నారాయణవనంలో..


నారాయణవనం: యువత మత్తు పదార్థాలు, గంజాయికి అలవాటు పడితే గుర్తింపు కోల్పోతారని పలువురు తెలిపారు. మత్తు పదార్థాల నియంత్రణ–మానవాళిపై ప్రభావం కార్యక్రమంలో భాగంగా స్థానిక ఉన్నత పాఠశాలల విద్యార్థులు, సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు 2 వేల మంది పుర వీధుల్లో నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో మానవ హారంగా ఏర్పడి, మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎంపీడీఓ అరుణ, ఎస్‌ఐ రాజశేఖర్, మెడికల్ ఆఫీసర్ దర్శిత్‌రాజ్, రాగసుధ, సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ జనార్ధనరాజు పాల్గొన్నారు.


సత్యవేడులో..


సత్యవేడు: సత్యవేడులో అధికారులు, పోలీసులు, విద్యార్థులతో కలిసి ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ర్యాలీలో పాల్గొన్నారు. సీఐ మురళీ నాయుడు, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ త్రివిక్రమరావు, ఎంఈఓ కే.రవి, ఎస్‌ఐ రామస్వామి, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వి.వెంకట్రామిరెడ్డి, ఎస్‌ఎస్‌ఎస్ అధికారి శివరాం, డాక్టర్లు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కరు పాల్గొన్నారు.

వరదయ్యపాళెంలో..

వరదయ్యపాళెం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎస్‌ఐ మల్లికార్జున ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించి ర్యాలీ చేపట్టారు. ప్రిన్సిపల్ రఘుపతి, ఎంపీడీఓ ప్రసాద్, ఈఓపీఆర్డీ చిరంజీవి పాల్గొన్నారు.







వరదయ్యపాళెం బస్టాండ్ వద్ద ర్యాలీ.. డ్రగ్ నిర్మూలనపై ర్యాలీ చేస్తున్న అధికారులు, పోలీసులు, విద్యార్థులు, సత్యవేడు: అవగాహన ర్యాలీలో ఎమ్మెల్యే, అధికారులు

నేత రంగానికి ఊతమివ్వండి



మాట్లాడుతున్న ఆదిమూలం

నారాయణవనం: చేనేత రంగానికి ఊతమిస్తూ నూలు ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పించి, ప్రభుత్వం ప్రకటించిన విద్యుత్ వినియోగంలో రాయితీని అమలు చేయాలని పలువురు కార్మికులు కోరారు. గురువారం మండల కేంద్రమైన నారాయణవనంలో ఏపీ హ్యాండ్‌లూమ్స్ ఏడీ రమేష్ అధ్యక్షతన స్మాల్ క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం మాట్లాడుతూ వివిధ కారణాలతో సంప్రదాయ చేనేత వృత్తికి పలువురు దూరమవుతున్నారని ఆవేదన చెందారు. నూలు ఉత్పత్తులకు గిట్టుబాటు ధరను కల్పిస్తూ ఆధునిక టెక్నాలజీని జోడించి, చేనేత రంగాన్ని ఆదుకోవాలని సూచించారు. ఏడీ రమేష్ మాట్లాడుతూ నేతన్నలు ముందుకు వస్తే నారాయణవనంలో క్లస్టర్ ఏర్పాటు చేసి 90 శాతం రాయితీతో మగ్గాలను, జాకాడ్, లిఫ్టింగ్ డిజైన్లు, వర్క్ షెడ్‌లను ఏర్పాటుతో చేనేత రంగాన్ని అభివృద్ధి పరుస్తామన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు,నేత కార్మికులు పాల్గొన్నారు.